## రైతన్న మీకోసం వారోత్సవాలు ప్రారంభం



అవగాహన కల్పిస్తున్న ఏఓ కాత్యాయని

**పుట్లూరు, మార్చి 16 ప్రభాతవార్త**

పుట్లూరు మండలంలో రైతన్న మీకోసం వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిని కాత్యాయని మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ వారోత్సవాలు ఈ నెల 25వతేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు గ్రామ స్థాయిలో పాల్గొంటారన్నారు. అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి పంచ సూత్రాలు అయిన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా రాబోయే ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ సూచనలను ముందస్తుగా ఇవ్వడం వలన రైతులు పంటల సాగు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రాట్ ప్రూఫింగ్ మోడల్ పద్దతులను పాటించడం వలన కలిగే ఉపయోగాలు మరియు ఆవశ్యకత గురించి రైతులకు వివరించడం జరుగుతుందని ఏఓ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ప్రెసిడెంట్ గోవర్ధన్‌రాజు, ఏఇఓ నాగిరెడ్డి, విహెచ్‌ఏ రవితేజ, రైతులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలం మంజూరు చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ నాయకులు

**తాడిపత్రిటౌన్, మార్చి 16 ప్రభాతవార్త**

తాడిపత్రి ప్రాంతంలో సొంత ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం మంజూరు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు సోమవారం తాడిపత్రి పట్టణంలో పట్టణ సిపిఐ సమితి కార్యదర్శి చిరంజీవియాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ సొంత ఇల్లు లేని వారిని గుర్తించి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు ఇళ్లు లేని వారికి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలమిచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని వాగ్దానం చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఇళ్లు లేని వారికి ఒక సెంటు స్థలం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. పట్టణంలోని సొంత ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలమిచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలన్నారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగయ్య, పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, నాగేంద్ర, తాడిపత్రి మండల కార్యదర్శి నాగ రంగయ్య. సూరి, నాయక్, శీనా, అబ్రహం, రంగస్వామి. నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

**పుట్లూరు, మార్చి 16 ప్రభాతవార్త**

మండల కేంద్రం లోని తహశీల్దార్ కార్యాలయం సమీపం లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 126 సోమవారాలుగా దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి గాను ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, నాగేంద్రనాయుడు, భారతీయ జనతాపార్టీ అసెంబ్లీ ఎక్స్ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

**పుట్లూరు, మార్చి 16 ప్రభాతవార్త**

ప్రస్తుతం వేసవికాలాన్ని దృష్టిలో వుంచుకుని పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కడవకల్లు గ్రామంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటేష్ తన సొంత ఖర్చుతో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ప్రతి శుక్రవారం కడవకల్లు గ్రామంలోని ఉన్నత పాఠశాలతో పాటు ప్రతి సోమవారం పుట్లూరు హైస్కూల్‌లోని విద్యార్థులకు రికార్డు అసిస్టెంట్ వెంకటేష్ తన సొంత ఖర్చుతో మజ్జిగ పంపిణీ చేయనున్నారు. ఆయన సేవాభావం పట్ల పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బి.రఘునాథ్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దీక్ష నృత్య కళాక్షేత్రం ప్రారంభం



నృత్య కళాక్షేత్రం ప్రారంభిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్ , మార్చి 16 ప్రభాతవార్త**

సోమవారం రోజు అనంతపురం నగరంలోని జే.ఎన్టీ.యూ. సమీపములో దీక్ష యోగ,సంగీత,నృత్య,వాయిద్య కళాక్షేత్రం ప్రారంభోత్సవం ఘనంగా జరిగినది. నిర్మల ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహకరాలు ఎం.నాని నవమి యోగ టీచర్, కేశవ యోగ టీచర్, అమరవాణి సంగీతం టీచర్, ఫ్లూట్ మాస్టర్ లక్ష్మీనారాయణ, కూచిపూడి నృత్యం టీచర్ శ్రీలక్ష్మీ మరియు వారి మిత్రుల బృందం చిత్రలహరి టీం ఓబుల్ దాసు పవన్, భాస్కర్,విరుపాక్షిలు పాటలతో అలరించారు. యోగ మహేష్ బాబు, ముఖ్యఅతిథిగా డి.ఆర్.ఓ మలోలా విచ్చేశారు. మన భారత కళలను ప్రోత్సహించాలని ఆయన కోరారు

## నేను మీకు కూలీనా..!

**-విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయా అని అడగడం తప్పా**

**-రైతులపై విద్యుత్ శాఖ ఏడిఈ ఆగ్రహం**

**పుట్లూరు, మార్చి 16 ప్రభాతవార్త**

వ్యవసాయమే జీవనోపాధిగా బతుకులు వెల్లదీస్తున్న రైతులపై విద్యుత్ శాఖ అధికారి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు తాము నమ్ముకొన్న భూముల్లో బోర్లు వేసుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కొరకు మండలంలో వందలాది మంది రైతన్నలు దరఖాస్తు చేసుకొన్నారు. అయితే మండలానికి రెగ్యులర్ ఏఈ లేకపోవడంతో ఎడి ఇన్‌చార్జ్ భాధ్యతలు తీసుకొన్నారు. కాగా రైతులు వెళ్లిన సమయంలో అధికారి అందుబాటులో లేకపోవడంతో, రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల విషయమై ఫోన్ చేస్తే నేను మీకు కూలీలాగా కనిపిస్తున్నానా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం క్రితం మండలానికి ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కావడంతో రైతులు అధికారిని ప్రాధేయపడుతున్నారు. కానీ ఆయన రైతులపై కనికరం చూపడం లేదన్నారు. అంతేకాకుండా దరఖాస్తు చేసుకోగానే ఎస్టిమేషన్ వేయడానికి ముందుగానే ముడుపులు చెల్లించాల్సి వస్తోందని పలువురు రైతులు భహిరంగంగా చర్చించుకొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులపై దురుసుగా ప్రవర్తిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## సజావుగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

**- పరీక్షలకు 2674 మంది హాజరు,33 మంది గైర్హాజరు**



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులతో తల్లిదండ్రులు

**తాడిపత్రిఅర్బన్, మార్చి 16 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలో పదవ తరగతి పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగిన పరీక్షకు మొత్తం 2674 మంది విద్యార్థులు హాజరు కాగా 33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓలు నాగరాజు, రామగోవింద్‌రెడ్డి తెలిపారు. తాడిపత్రి పట్టణంలో 11 రెగ్యులర్ పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2564 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, అందులో 2552 మంది హాజరయ్యారు, 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే 2 ఓపెన్ పరీక్ష కేంద్రాల్లో మొత్తం 143 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, అందులో 122 మంది హాజరయ్యారు, 21 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 13 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 13 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 13 మంది కస్టోడియన్లు, 194 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు. అదనంగా సిట్టింగ్ స్క్వాడ్లు పర్యవేక్షించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు. విద్యార్థులకు వైద్య సదుపాయం, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు ఎంఈఓలు తెలిపారు. సోమవారం జరిగిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని వారు పేర్కొన్నారు.

## రూరల్ సిఐని కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు



సిఐని సన్మానిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**తాడిపత్రిటౌన్, మార్చి 16 ప్రభాతవార్త**

తాడిపత్రి మండల ఎంఆర్‌పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన దేవగుడి శివరంగయ్య మాదిగ సోమవారం తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.పెద్దిరాజు, వై.రామమోహన్, ఎస్.పెద్దరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పంచ సూత్రాలపై అధికారులు రైతులకు వివరించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ ఆంజనేయులు

**తాడిపత్రిటౌన్, మార్చి 16 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి పంచ సూత్రాలపై అధికారులు రైతులకు వివరించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు తెలియచేశారు. తాడిపత్రి మండలంలో సోమవారం నుండి రైతన్న మీకోసం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ వారోత్సవాలు ఈ నెల 25వతేదీ వరకు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు గ్రామ స్థాయిలో పాల్గొంటారన్నారు. అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి పంచ సూత్రాలు అయిన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు రైతులకు వివరించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా రాబోయే ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ సూచనలను ముందస్తుగా ఇవ్వడం వలన రైతులు పంటల సాగు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రాట్ ప్రూఫింగ్ మోడల్ పద్దతులను పాటించడం వలన కలిగే ఉపయోగాలు మరియు ఆవశ్యకత గురించి రైతులకు వివరించడం జరుగుతుందని ఏఓ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఏఇఓ విశ్వేశ్వరి, వీఏఏ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ సిబ్బంది, వివిధ సేవా సంస్థల సభ్యులు

**కదిరి, మార్చి 16 ప్రభాతవార్త**

ప్రముఖ ప్రసిద్ది గాంచిన శ్రీమత్‌లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈఓ తెలిపిన వివరాల మేరకు ఆలయంలో 35 రోజులకుగాను నగదుగా 1,15,10,416 మొత్తం, 2 గ్రాముల బంగారం, 305 వెండి వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ బి.రామకృష్ణరెడ్డి, బ్యాంకు సిబ్బందితోపాటు వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## పేదలకు ఇంటి నివేసస్థలాలు ఇవ్వాలి



ఎంపిడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు

**ఓబుళదేవరచెరువు, మార్చి 16, ప్రభాతవార్త**

మండలంలోని అర్హులైన నిరుపేదలకు ఇంటి నివేసస్థలాలు ఇవ్వాలని కోరుతూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా నాయకుడు శ్రీరాములు మాట్లాడుతూ.....కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంత నిరుపేదలకు 3 శెంట్లు, పట్టణ ప్రాంత పేదలకు 2 శెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పటి వరకూ దాని ఊసే లేదన్నారు. కనుక అర్హులైన ప్రజలకు ఇంటి నివేసస్థలంతో పాటు పక్కాగృహాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఓ శిరాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. స్థానిక శివాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రామునాయుడు, అధ్యక్షుడు నాగరాజు, నాయకులు గంగాద్రి, రమణ, రామాంజినేయులు, అలీబాష, మహిళా నాయకురాలు కమలమ్మ, గంగాదేవి, విజయమ్మ, లక్ష్మీదేవి, రమణమ్మ పాల్గొన్నారు.

## ఘనంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**అమడగూరు, మార్చి 16 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని చౌడేశ్వరి కళ్యాణమండపంలో సోమవారం దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుధిలి సుదర్శన్ మాట్లాడుతు భారతీయ జనతా పార్టీ విధి విధానాలు గురించి వివరించారు. ఓబిసి రాష్ట్ర కార్యదర్శి హసనపురం చంటి మట్లాడుతు సామాజిక మీడియా యొక్క ప్రాముఖ్యత వాటిని వినయోగించి పార్టీని ఎలా బలోపేతం చేయాలో వివరించారు. మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామిశెట్టి వేమనారాయణ, ఎస్‌టి మోర్చా ప్రధాన కార్యదర్శి మూడే హరినాయక్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చింతా శరత్‌కుమార్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి జయచంద్రారెడ్డి, ఇందుకూరి సురేందర్‌రెడ్డి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగులప్ప, మండల ప్రధాన కార్యదర్శులు ఆదినారాయణ, నారాయణస్వామి, యువమోర్చ మండల అధ్యక్షుడు ఎస్.హరీష్‌కుమార్, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, ఒబిసి మండలాధ్యక్షుడు తిప్పన, సీనియర్ నాయకులు ఐ.రాము, సుబ్బిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొనారు.

## రైతన్నలు మీకోసం కార్యక్రమం

**నల్లచెరువు మార్చి 16 ప్రభాతవార్త**



వ్యవసాయ శాఖ గోడపత్రికల ద్వారా రైతులకు అవగాహన

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని ఏవో లక్ష్మి ప్రియ తెలిపారు. నల్ల చెరువు మార్చి 16 ప్రభాత వార్త, మండల కేంద్రం లోని సోమవారం బసవన్న కట్ట సమీపంలొ రైతన్న మీకోసం కార్యక్రమం ఏవో లక్ష్మీ ప్రియ, నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పతకాలపై అవగాహన కల్పించారు. అధికారులు రైతులు తో కలిసి గోడ పత్రిక లను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ కుమార్ రెడ్డి, తెదేపా మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు, సహకార సంఘం అధ్యక్షులు వెంకటరమణ . హెచ్ ఓ లావణ్య, మాజీ ఎంపీపీలు మాబు సాబ్, అబ్దుల్ ఖాదర్, మాజీ కన్వీనర్ నాగభూషణ నాయుడు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అశ్వర్థ నాయుడు , మాజీ సింగల్ విండో చైర్మన్ ఎద్దుల అంజినప్ప, డివి వేణు, కూటమి నాయకులు జెరిపిటి శంకర. గంగులప్ప, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మండల కార్యాలయ సిబ్బంది.

**నల్లచెరువు ఫిబ్రవరి16 ప్రభాతవార్త**

తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125 వ జయంతి వేడుకలు మండల అభివృద్ధి కార్యాలయం నందు ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలిత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసిన నివాళులు అర్పించారు అనంతరం ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మద్రాసు కేంద్రంగా తమిలు ల తో కలిసి ఉండే వాడని ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం సాధించడం ద్వారా ఆయన తెలుగువారి హృదయాల్లో అమరజీవిగా నిలిచిపోయారన్నారు ఆయన జీవిత భావితరాలకు ఆదర్శమన్నారు. ఆయన తెలుగు వారికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 54, రోజులు నిరాహార దీక్ష చేసి 1952, డిసెంబర్ , 15 న మరణించారన్నారు ఈయన దీక్ష ఫలితంగా నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది అన్నారు సత్యం అహింస ఎంతటి గొప్ప లక్షణాలైనా సాధించగలవని ఈ పోరాటం ప్రపంచానికి స్పూర్తిదాయకగా నిలిచిందన్నారు ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరూ పని చేయాలని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కౌన్సిల్ సభ్యులకు వీడ్కోలు సభ

**తాడిపత్రిటౌన్, మార్చి 16 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు వీడ్కోలు సభ ఏర్పాటు చేసినట్లు కమీషనర్ శివరామకృష్ణ తెలిపారు. వీడ్కోలు సభ అనంతరం మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విందు ఏర్పాటు చేయడం జరుగుతుందని కమీషనర్ తెలిపారు.

## జనతా వారధి కార్యక్రమానికి నిధులు ఏర్పాటు చేయండి



జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందించిన జనతా వారధి సభ్యులు

**ముదిగుబ్బ మార్చి 16 ప్రభాతవార్త**

రాబోయే ఉగాది వసంత నవరాత్రులు మరియుశ్రీరామునవిపర్వదినాలను పురస్కరించుకొని ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన నిధులు ఏర్పాటు చేయాలని స్థానిక బిజెపి నాయకులు సోమల ప్రకాష్ మరియు వారధి సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అంద జేశారు. భారతీయ జనతా పార్టీ చేపడుతున్న జనతా వారధి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆధారంగా తీసుకొని ఈ అభ్యర్థులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జనతా వారధి సభ్యులు మాట్లాడుతూ జిల్లాలోని అనేక గ్రామాల్లో ఉన్న రామాలయాలు అమ్మ వారి ఆలయాలు. గ్రామదేవతల ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు మరియు భక్తులకు తగిన ఆర్థిక వనరులు లేవని వెల్లడించారు. ఈ నేపథ్యంలో దేవాలయ ధర్మాదాయ శాఖ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయ ప్రాంగణాల శుభ్రత విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక పూజలు సీతారామ కళ్యాణం ప్రసాదం పంపిణీ అన్నదాన కార్యక్రమాలునిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే ఉత్సవాల సమయంలో ఆలయాలకు వచ్చే భక్తులకు తాగునీటి సదుపాయం తాత్కాలిక పందిల్లు భద్రతా ఏర్పాట్లు మరియు ఇతర మౌలికవసతులుకల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా అధికారులదృష్టికి తీసుకువెళ్లామన్నారు. ముఖ్యంగా ఉగాది పర్వదినం సందర్భంగా మార్కెట్ ప్రాంతాల్లో ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేసే నేపథ్యంలో అక్కడ శుభ్రత తాగునీటి సదుపాయం ట్రాఫిక్ నియంత్రణ తాత్కాలిక షెడ్లు మరియు భద్రత ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు విన్నవించారు హిందువులకు అత్యంత ముఖ్యమైన పండుగలైన ఉగాది మరియు శ్రీరామనవమి ఉత్సవాలను జిల్లా అధికారులు సమన్వయంతో నిర్వహించేందుకు చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని జనతా వారధి కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

**ఓబుళదేవరచెరువు, మార్చి 16, ప్రభాతవార్త**



మృతి చెందిన నవీన్

మండలంలోని తంగేడుకుంట గ్రామానికి చెందిన నవీన్(24) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇందుకు సంబంధించి వారు తెలిపిన వివరాల మేరకు మృతుడు నవీన్ రైతు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి బాసటగా నిలచేవాడన్నారు. ఇందులో బాగంగా సోమవారం అరకబావిపల్లికి చెందిన మునిస్వామని అనే రైతు పొలానికి పేడు ఎరువు ట్రాక్టర్‌లో తరలించే కూలి పనికి వెళ్లాడన్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌లోకి ఎరువు నింపుతుండగా నవీన్ స్టే వైరును తాకాడన్నారు. వెంటనే నవీన్ విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడన్నారు. ఇది గమనించిన తోటి కూలీలు నవీన్ పక్కలాగి హుటాహుటిన మండల కేంద్రంలోని ప్రభుత్వం అసుపత్రికి తరలించా రన్నారు. వైద్యులు పరీక్షించి అప్పటికే నవీన్ మృతి చెందినట్లు నిర్ధారించా రన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై మల్లికార్జునరెడ్డి మృతదేహాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఘటనపై విచారణ చేపట్టారు. మృత దేహాన్ని టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు చౌట కిష్ట తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు ఫోన్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నవీన్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. యువకుడు నవీన్ అకాల మరణం పొందడంతో తంగేడుకుంట గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## అమరజీవి ఆంధ్రకే కాదు దేశానికి ఒక స్ఫూర్తిప్రదాత



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్ , మార్చి 16 ప్రభాతవార్త**

అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర కే కాదు దేశానికి స్ఫూర్తిప్రదాతని మండల పరిషత్ అభివృద్ధి అధికారి దివాకర్, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకట నాయుడు పేర్కొన్నారు.అనంతపురము రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఎంపీపీ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగాఅమరజీవిపొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అన్న పేరు వినగానే తనకు మొదట గుర్తొచ్చే పేరు అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు.పొట్టి శ్రీరాములు కేవలం ఆంధ్రకే కాదు, భారతదేశం మొత్తానికి ఒక స్ఫూర్తిప్రదాత అని, దేశం గర్వించదగ్గ వ్యక్తి ఆయన అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రాలను భాషా ప్రాతిపదికన విభజించాలా లేక పరిపాలనా సౌలభ్యం కోసమా అనే సందిగ్ధంలో ఉన్నప్పుడు, ఖిభాషఖి అనేది ప్రజలను కలిపి ఉంచే ఒక బలమైన శక్తి అని పొట్టిశ్రీరాములునిరూపించారన్నారు. భాష తెలిస్తేనే అక్కడి సంస్కృతి అర్థమవుతుందని, ఆయన చేసిన పోరాటం వల్లే నేడు మనమంతా ఈ స్థితిలో ఉన్నామన్నారు. దయచేసి అందరూ కూడా ఆయన స్ఫూర్తినికొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ జి ఎస్ అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## టెక్‌లో ఘనంగా ఖేల్‌కూద్ ప్రతియోగితా




విద్యార్థినిలకు బహుమతులు అందచేస్తున్న సురేష్‌రెడ్డి

**తాడిపత్రిరూరల్, మార్చి 16 ప్రభాతవార్త**

తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఖేల్‌కూద్ ప్రతియోగితా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుగ్గా పాల్గొనాలన్నారు. అనంతరం కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన వారికి ట్రోఫీ అందచేశారు. అదేవిధంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.నటరాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఐవి సుబ్బారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంసి భానుప్రసాద్, డిప్లొమో ఇన్‌చార్జ్ సి.రఘునాథరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుత్తిలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు


అమరజీవికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గుత్తి, మార్చి 16 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలో సోమవారం తెలుగు భాషా ప్రయుక్త ఆంధ్ర రాష్ట్రం సాధించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ సర్కిల్లో ఉన్న ఆయన విగ్రహానికి రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్, టిడిపి పట్టణ కన్వీనర్ ఎంకే చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజల కోసం ఆయన చేసిన త్యాగ నిరతిని వారు కొనియాడారు. అనంతరం ఆయన విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మాకం శ్రీకాంత్, అచ్యుత మల్లికార్జునగుప్తా, కిషోర్‌బాబు, నాగం సుదర్శన్‌తో పాటుగా పెద్దసంఖ్యలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర పెన్షనర్ల కార్యాలయంలో సంఘం కోశాధికారి కుళ్లాయిబాబు, అసోసియేట్ అధ్యక్షురాలు స్వర్ణాంబ, కార్యదర్శి రామ్మోహన్, ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని బేతాపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఓబులపతి, టీచర్ రామకృష్ణ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షణ్ముఖ్ 13 వేల రూపాయలు విలువ చేసే బీరువాను అందచేశారు. ఉపాధ్యాయురాలు నిరుపమా 6 వేల రూపాయలు పాఠశాల అభివృద్ధికి అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

గుంతకల్లు, మార్చి 16 ప్రభాతవార్త

గ్యాస్ కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా దాడులు ప్రారంభమైన రోజు నుండి గ్యాస్, పెట్రోల్, డీజిల్ తదితర నిత్యావసర ధరలు పెంచడంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొంతమంది గ్యాస్ అక్రమ మార్గంలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కమర్షియల్ గ్యాస్ కొరత సృష్టించడంతో వ్యాపారులకు ఇబ్బందులు తప్పడంలేదన్నారు. అధికారులు స్పందించి గ్యాస్ కొరతను అరికట్టి నిత్యావసరసరుకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు సురేంద్రబాబు, ఐద్వా మహిళా నాయకురాలు జ్యోతి, లక్ష్మీబాయి, నాయకులు ఉలిగప్ప, వెంకీ, క్రిష్టప్ప, రాము, వీరన్న, బాష, తదితరులు పాల్గొన్నారు.

## మోడీ అంటే ఎందుకు మీకు అక్కసు

**-గోరంట్ల కూటమిలో...ప్రోటోకాల్ కుమ్ములాట**
**-మల్లాపల్లి అన్నదాత సుఖీభవ ప్రోగ్రాంను బహిష్కరించిన... గోరంట్ల బిజెపి నేతలు -గోరంట్ల తెలుగు తమ్ముళ్లపై మండిపడ్డ బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ**


బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ (ఫైల్‌ఫోటో)

గోరంట్ల, మార్చి 16 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో ప్రధాన ఆయువు పట్టు అయిన భారతీయ జనతా పార్టీ నాయకులపై గోరంట్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు చూపిస్తున్న సవతి తల్లి ప్రేమ సరైనది కాదని కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదని, కేంద్ర ప్రభుత్వ పథకం సంబంధించిన ఫ్లెక్సీలపై ప్రధాని నరేంద్రమోడీ ఫోటో లేకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని గోరంట్ల మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బోయ లక్ష్మినారాయణ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని మల్లాపల్లి పంచాయతీ కేంద్రంలో సోమవారం కూటమి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కిసాన్, అన్నదాత సుఖీభవ కార్యక్రమాలు నిర్వహిస్తూ వేసిన ఫ్లెక్సీ పై నరేంద్రమోడీ ఫోటో లేకపోవడాన్ని గమనించిన బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, నియోజకవర్గ కన్వీనర్ బొట్టు శ్రీనివాసులు తదితరులు ఆ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు పాత్రికేయులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రధానమంత్రి మరియు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలు ఆనవాయితీ అని అయితే కొందరు తెలుగుదేశం పార్టీ నాయకుల నిర్లక్ష్యం కారణంగా ప్రోటోకాల్ వివాదం ముదురుతోందని తెలిపారు. ముఖ్యంగా వాటితో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గోరంట్లలో కోట్లాది రూపాయల వర్కులు జరుగుతున్న ఏనాడు బిజెపి శ్రేణులకు ఒక్క వర్క్ కూడా ఇవ్వలేదని, అధికారికంగా సమావేశాలు ఏర్పాటు చేస్తే ఎక్కడో ఒక మూలన కుర్చీ ఇస్తున్నారని, మరోవైపు ప్రభుత్వ కార్యాలయంలో సైతం అధికారులు చిన్నచూపు చూస్తున్నారని ఇదేనా సమన్యాయం అంటే అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గోరంట్లలో ఇలాగే కొనసాగితే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లక తప్పదని వారు పేర్కొన్నారు.

## రైతన్నా.. మీ కోసం వారోత్సవాలు..

**- పంచ సూత్రాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన**
**- ఏపీ ఎమ్స్ యాప్ డౌన్‌లోడ్, ఏపీ ఫార్మర్ ఐడి, ఈ పంట ఫార్మర్ ఈకేవైసి చేయడం**
**- ఎలనినో, మిడిలిస్ట్ వార్ ప్రభావం గురించి చెప్పడం**



రైతన్న మీకోసంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అగళి, మార్చి 16 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16, 17, 18, 23, 24,25 తేదీలలో " రైతన్నా మీ కోసం " కార్యక్రమాన్ని అగళి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు జడ్పిటిసి ఉమేష్,మండల కన్వీనర్ తిప్పేస్వామి, సీనియర్ నాయకులు శ్రీనివాసులు రైతు సేవా కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ.. రైతు సేవా కేంద్రాలలో నిర్దేశించిన కమిటీ సభ్యుల ద్వారా ఇంటింటా తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చినటువంటి లేఖను ఇస్తూ అదే విధంగా ఆ లేఖలో ఉన్నటువంటి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు సాగు, వ్యవసాయంలో సాంకేతికత ఆహార శుద్ధి, ప్రభుత్వ మద్దతు రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాతా సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద మూడువిడతల్లో ఒక్కొక్కరికి రూ.20వేలచొప్పున అర్హతఉన్న రైతు కుటుంబాలకు ఇవ్వడం జరిగిందన్నారు. వాతావరణ పరిస్థితులు, మారుతున్న కాలానికి అనుగుణంగా డిమాండ్ ఆధారిత పంటలను ప్రకృతి వ్యవసాయం పద్ధతులు వాడుతూ రసాయనాల వాడకాన్ని తగ్గించి వివిధ రకాల పంటలు సాగు చేయాలని ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ప్రీ మన్సూన్ డ్రై సోయింగ్, పెల్లెటైజేషన్, డ్రాట్ ప్రూఫ్ మోడల్, హాఫ్ మూన్ మోడల్, ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్‌లలో ఘన, ద్రవ బీజామృతాలు, కషాయాలు వాడాలని, చిరుధాన్యాలు, మల్బరీ, ఉద్యానవన పంటలు, పాడి చేపట్టాలని అలాగే నూతన టెక్నాలజీలో భాగంగా ఫార్మర్ ఐడి, ఈ పంట ఫార్మర్, ఈ కేవైసిచేసి, ఏపీఎయిమ్స్ రైతు యాప్ ఇన్స్టాల్ చేస్తూ, కిసాన్ డ్రోన్, డ్రిప్, స్ప్రింక్లర్స్ గురించి తెలియజేశారు. ఇంటింటి సర్వేలో పాల్గొన్న రైతులు వివరాలు కూడా రైతన్న మీకోసం యాప్‌లో అప్లోడ్ చేయడం జరుగుతుంది అని మండలవ్యవసాయఅధికారి నాగరాజుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ప్రభుత్వం అందజేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలోప్రజాప్రతినిధులు,రైతులు,అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

అమరాపురం మార్చి 16 ప్రభాతవార్త


చిత్రపటానికి విశేష పూజలు దృశ్యం

మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుక లు సందర్భంగా తహసిల్దార్ లక్ష్మీ నరసింహం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవిన్యూ ఇన్స్పెక్టర్ విన్సెంట్ పాల్ మరియు ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మరియు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు ఎంబి: అశోక్ కుమార్, నాగభూషణ్, అజయ్, కిషోర్, నటరాజ్ ,సత్యనారాయణ, ఉమ్మడిశెట్టి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ తో పాటు ఆర్యవైశ్య సంఘం తరపున విశేషపూజలునిర్వహించి ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం తీసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలో మహాత్మా గాంధీ మరియు పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు తమ వంతు సహాయ సహకారాలను అందించడానికి కృషి చేస్తామని అమరాపురం ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి చంద్రశేఖర్ గుప్తా ,ఎంబి అశోక్‌లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమరాపురం సింగల్ విండో డైరెక్టర్ దాదా పీర్,కనకనపల్లి డీలర్ తిప్పేస్వామి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

## చైనాలోప్రదర్శించిన ధర్మవరం పట్టుచీర

ధర్మవరంటౌన్ , మార్చి 16 ప్రభాతవార్త


చైనాలో ప్రదర్శనలో పట్టుచీరను నేస్తూ చూపుతున్న ధర్మవరం డిజైనర్ జుజురు నాగరాజు

చైనా దేశంలోని గాంష్టుహౌ నగరంలో సోమవారం నిర్వహించిన వసంత్ మేళా కార్యక్రమంలో ధర్మవరంకు చెందిన చేనేత డిజైనర్,జాతీయ అవార్డు గ్రహిత జుజురు నాగరాజు పట్టుచీరను ఎలా తయారు విదానాన్ని చూపించారు. ఇండియా నుంచి ఒక చిన్నచేనేత మగ్గాన్ని తీసుకెళ్లి, అక్కడ ఫ్యాషన్ డిజైనింగ్ విద్యార్థులకు, కళాశాల అధ్యాపకులకు ఇర చైనావాసులకు చేనేత గురించి వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ సౌకర్యం కల్పించేదిశగా పట్టుచీరల ప్రదర్శన నిర్వహించినట్లు నాగరాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేనేత సేవా కేంద్రం, హ్యాండ్లూమ్ ఎక్స్ పోట్ ప్రమోషనౌ కౌన్సిల్ సహకారంతో ఈ కార్యక్రమ నిర్వహణకు చైనాకు వెళ్లినట్లు డిజైనర్ తెలిపారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతన్న..మీకోసం ఏవో వెంకట బ్రహ్మం

రొళ్ల మార్చి16 (ప్రభాతవార్త):


రైతులకు రైతన్న మీకోసం పై అవగాహన కల్పిస్తున్న ఏవో

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రూపొందించిన పంచసూత్రాలు ప్రతి రైతు వరకు చేరాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమే రైతన్న.. మీకోసం కార్యక్రమమని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట బ్రహ్మం పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రొళ్ల మండలంలోని బీజీ హళ్లి గ్రామపంచాయతీలో రైతన్న.. మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి రైతులకు రైతన్న..మీకోసం కరపత్రాలు అందజేశారు. అనంతరం రైతులతో ఏవో మాట్లాడుతూ.. ప్రభుత్వం దీర్ఘకాలిక దూరదృష్టితో రూపొందించిన పంచసూత్రాలు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.నూతన విధానాలు, ఆధునిక సాంకేతికత, తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు, పంట భీమా, నీటి వినియోగ సమర్థత వంటి అంశాలను రైతులు అవలంబిస్తే.. వ్యవసాయం లాభదాయక రంగమవుతుందన్నారు. రైతు కుటుంబాలన్నింటికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం రైతన్నా.. మీ కోసం" కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో అధికారులు నేరుగా రైతు ఇంటికే వెళ్ళి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.రైతు సమస్యలు ప్రభుత్వం దృష్టికి చేరేలా అంకితభావంతో పని చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయశాఖ పంచసూత్రాల్లోని కీలక అంశాలను వివరించారు. తక్కువ వ్యయంతో అధిక దిగుబడి పద్ధతులు, ఆధునిక సాగు విధానాలు, డ్రిప్- స్ప్రింక్లర్ టెక్నాలజీ, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల అందుబాటు, పంటలకు మార్కెట్ హామీ, ధరల స్థిరీకరణ,రైతు భీమా, సహాయక పథకాల ప్రయోజనాలు, వీటి పై విపులంగా రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ఆయా రైతు సేవల కేంద్ర పరిధిలో ఈనెల 25 వరకు ఐదు రోజులపాటు ఆర్ఎస్కే సిబ్బంది, వీఆర్వోలు, ఇంజనీర్ అసిస్టెంట్లు, భాగస్వాములుగా చేసుకొని రైతులకు రైతన్న మీకోసం కార్యక్రమం పై వివరించనున్నట్లు ఏవో వెంకట బ్రహ్మం పేర్కొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు 125 వ జయంతి వేడుకలు.

కనగానపల్లి మార్చి 16 ప్రభాతవార్త


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంపీడీవో కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కే.టి.శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి అమరజీవి అయ్యారని ఆయన సేవలను వారుకొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎంసిఓ తిరుపాలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకేష్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎలక్కుంట్ల బాలు, బిఎఫ్‌టి నారాయణస్వామి లు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శప్రాయం

**జిల్లా ఎస్పీ సతీష్ కుమార్**

పుట్టపర్తి, మార్చి 16, ప్రభాతవార్త


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, పోలీసు అధికారులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మహోన్నత త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. సమాజం, ప్రజల కోసం త్యాగస్ఫూర్తితో సేవలందించిన ఆయన సేవలను ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశం, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐలు వలి, మహేష్, ఆర్ఎస్ఐ ప్రదీప్ సింగ్, ఏ ఆర్ పోలీస్ సిబ్బంది డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ ను అరికట్టి నిర్మూలించండి..

**- హెల్మెట్లు శిరస్సుకు ధరించండి...- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్..**

మడకశిర టౌన్ మార్చి 16 ప్రభాతవార్త


డ్రగ్స్ అవగాహన కార్యక్రమం సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్.

సత్య సాయి జిల్లాలో యువత, ప్రజలు డ్రగ్స్ ను అరికట్టి నిర్మూలించంలని హెల్మెట్లు శిరస్సుకు ధరించి ద్విచక్ర వాహనం నడపాలని మీ కుటుంబం మీ చేతుల్లో ఉందని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలో అమరాపురం బస్టాండ్ లో డ్రగ్స్ నివారణ, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి వాహనం నడపాలనే విధంగా కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ యువత, ప్రజలు, ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడి మిమ్మల్నిమీరు రక్షించుకుంటూ ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని ఆయన సూచించారు. 2024-25సంవత్సరంలో ప్రమాదాల వల్ల చనిపోయిన వారి సంఖ్య 20,000 మంది ఉంటే పుట్టపర్తి జిల్లాలోనే ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తూ ప్రమాదం వల్ల180 మంది దాకా చనిపోయారని ఎస్పి పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే1,000 చలానా కట్టాలి అదే 750రూ తో నాణ్యత కలిగిన హెల్మెట్ వాడి మీ ప్రాణాల్ని రక్షించుకోవచ్చు అన్నారు. మూడుసార్లు చలనతో వదిలివేసిన నాలుగవసారి దొరికితే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం కోసం వినూత్నమైనటువంటి స్టిక్కర్ ద్వారా చైతన్యం తీసుకోరావడానికి ప్రయత్నిస్తున్నామని. ఈ స్టిక్కర్ వినాయకుడు ఆశీర్వాదం చేస్తున్నట్లు డిజైన్ చేసి అందజేస్తామన్నారు. గంజాయి వల్ల యువత తమ భవిష్యత్తును చిన్నాభిన్నం చేసుకుంటారన్నారు. ఏ పరిణామములో దొరికితే ఎన్ని సంవత్సరాలు శిక్ష విధిస్తారు అన్న వివరాలను కూడా ఎస్పీ కూలంకుశంగా వివరించారు. డ్రగ్స్ లో దొరికిపోతే విదేశాలకు వెళ్లాలంటే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పోలీస్ శాఖ మీకు ఇవ్వదని తద్వారా మీరు విద్యా ఉద్యోగ అవకాశాలు కోల్పోయే అవకాశాలు కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా డ్రగ్స్ సేవిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వండి అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ సమాచారాన్ని మూడు లక్షల మందికి తెలియ చేయాలని కోరారు. తద్వారా మీరు కూడా అవగాహనలో భాగస్వాములు అవుతారు అన్నారు. ఇది పోలీస్ శాఖ బాధ్యత కాదు అందరి బాధ్యతగా భావించినప్పుడే సాధ్యపడుతుందన్నారు.

## రైతన్న మీకోసం ఇంటింటి సర్వే..

కొత్తచెరువు మార్చి 16 ప్రభాతవార్త


కరపత్రాలు పంచుతున్న దృశ్యం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ బడుతున్న రైతున్న మీ కోసం ఇంటింటి సెర్వే ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండలం వ్యవసాయాధికారి సతీష్ బాబు తెలిపారు కొత్తచెరువు మండలం లో ప్రతి రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం ప్రారంభించడం జరిగినది సర్వేలో భాగంగా కమ్మ పాలెం లో కొంతమంది రైతులు దగ్గరికి వెళ్లి కరపత్రాలు అందజేసి సర్వే వివరాలు గురించి రైతులకు తెలియజేశారు కొత్తచెరువు లోని ఇంటింటి సర్వే లో మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివ ప్రసాద్, కొత్తచెరువు నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు, సింగల్ విండో ప్రెసిడెంట్ హరి ప్రసాద్, బీజేపీ నాయకులు గంగా నాయుడు, ఎంపీడీఓ నటరాజ్, తదితరులు హాజరయ్యారు ఈ సందర్భంగా ఏవో సతీష్ బాబు అన్నదాత సుఖీభవ పీఎంకిసాన్ సంక్షేమ పథకం రైతులకు లబ్ది చేకూరిందా అని అడిగి తెలుసుకోవడం జరిగింది. అలాగే ముఖ్య మంత్రి సందేశం ను రైతులకు అందజేయడం జరిగింది. రైతులకు వ్యవసాయ శాఖ తరపు ఏపిఏఐయమ్ఎస్ 2.వీ యాప్ ను రైతుల మొబైల్ నందు ఇన్స్టాల్ చేసి వాటి ఉపయోగం రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సునీత, రైతు సేవా కేంద్రం సిబ్బంది అన్నపూర్ణ, భాగ్యమ్మ రైతులు వెంకటాచలపతి, రాజా నరేంద్ర, శ్రీనివాసులు, వెంకటేష్, శివప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండ నియోజకవర్గంలో రెగ్యూలర్ తహశీల్దార్లను నియమించండి

**-విడపనకల్లు మండలంలో అక్రమ మట్టి దందాపై చర్యలు తీసుకోండి -పీజీఆర్ఎస్‌లో పిర్యాదు చేసిన సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి**

ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త


పీజీఆర్ఎస్‌లో పిర్యాదు చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి తదితరులు

ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు మండలాలకు రెగ్యూలర్ తహశీల్దార్లను నియమించాలని, విడపనకల్లులో అక్రమంగా మట్టి దందాపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి ఎం.బి.చెన్నరాయుడు, సీనియర్ నాయకులు కె.రామాంజినేయులు కోరారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు రెగ్యూలర్ తహశీల్దార్లు లేకపోవడంతో ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూ సంబంధిత సమస్యలు, ఆదాయ ధ్రువపత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలు వంటివి అందక సామాన్య ప్రజలు మొదలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విడపనకల్లువద్ద సర్వే నంబర్ 100లో ప్రభుత్వ గుట్టలను తొలగించి అక్రమ మైనింగ్ జరుగుతోందని ప్రతిరోజూ టిప్పర్లు, ట్రాక్టర్లలో విలువైన ఎర్రమట్టి అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఈ విషయమై అనేకమార్లు స్థానిక అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకునేవారే లేరని వాపోయారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.

## ఉపాధి సొమ్మును దోచేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి

**-తహశీల్దార్ కార్యాలయం ముందు ఏపీ కౌలు రైతు సంఘం ధర్నా**
**-అక్రమార్కుల నుండి అణాపైసలతో సహా డబ్బు రికవరీకు డిమాండ్**



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఏపీ కౌలు రైతు సంఘం

ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త

ఉరవకొండ మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సొమ్మును దోచేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి వారి నుండి అణాపైసలతో సహా డబ్బును వసూళు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ఆంధ్రప్రదేశ్ కౌలు


ఈడీటీ వరప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైతు సంఘం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రంగారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి పెద్దముష్టూరు వెంకటేష్ మాట్లాడుతూ కూలీలు వలసలు పోకుండా వారికి ఉన్న గ్రామంలోనే పనులు కల్పించడానికి నిర్దేశించిన ఉపాధి హామీ పథకం నేడు కొందరు అవినీతి అధికారులు, సిబ్బందికి కల్పవృక్షంగా మారిందన్నారు. ఏ ఏడాది కా ఏడాది ఉపాధి హామీలో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయని సామాజిక తనిఖీలు బయటపెడుతుండగా బాధ్యులపై చర్యలు తీసుకొని వారి నుండి దిగమింగిన సొమ్మును రికవరీ చేయడంలో డ్వామా అధికారులు వ్యవహరిస్తున్న తీరు అక్రమార్కులకు ఊతమిచ్చేలా ఉందని వాపోయారు. 2023-24లో జరిగిన పనుల్లో 78,66,935 రూపాయల నిధులు దుర్వినియోగం అయినట్లు ఆధారాలతో బయటపెట్టగా కేవలం 9,29,014 రూపాయలు మాత్రమే రికవరీకు ఆదేశించారని అందులో ఇప్పటివరకు కేవలం 61వేల రూపాయలు మాత్రమే రికవరీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 2024-25లో 1.50 కోట్ల రూపాయలు విలువైన పనుల్లో అవకతవకలు జరిగాయని ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం బయటపెడితే అధికారులు మాత్రం కేవలం 1.48 లక్షల రూపాయలు మాత్రమే రివరీకు రాయడం ఏంటని ప్రశ్నించారు. అవకతవకలపై నిజాయితీ కల్గిన ఇతర శాఖల అధికారులతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ధర్నా అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈడీటీ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాయకులు సిద్దప్ప, శీనప్ప కౌలు రైతు సంఘం నాయకులు సుంకన్న, నారాయణ, కుళ్లాయప్ప, తిప్పమ్మ, ఎర్రమ్మ, రామన , శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షలను తనిఖీ చేసిన స్క్వాడ్ నరసింహారెడ్డి

బెలుగుప్ప, మార్చి 16 ప్రభాతవార్త


10వ తరగతి పరీక్షలను రాస్తున్న విద్యార్థులు

బెలుగుప్ప మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను స్క్వాడ్ నరసింహారెడ్డి సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి మాస్ కాపింగ్ కాని, ఇతరాత్ర లభించలేదని ఆయన పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 230 మందికిగాను 228 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు తెలిపారు. శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో 218కిగాను 211 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి హరికృష్ణ తెలిపారు.

## ఎరగుడి గ్రామంలో సిసి రోడ్డును ప్రారంభించిన మండల కన్వీనర్ సునీల్

బెలుగుప్ప, మార్చి 16 ప్రభాతవార్త


సిసి రోడ్డును పరిశీలిస్తున్న మండల కన్వీనర్ సునీల్

బెలుగుప్ప మండల పరిధిలో ఎరగుడి గ్రామంలో సోమవారం బిసి కాలనీలో రూ.20 లక్షల నిధులతో సిసి రోడ్డును నిర్మిస్తున్నామని తెలుగు దేశం మండల కన్వీనర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సిసి రోడ్డుకు భూమి పూజ చేసి, రోడ్డును నాణ్యతగా త్వరలోనే పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు లక్ష్మినారాయణ, ఎరిస్వామి, ఇంజనీర్ పరుశురామ్, ఇంజనీర్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా పదవ తరగతి పరీక్షలు తనిఖీ చేసిన తహశీల్దారు,ఎస్ఐ

గుడిబండ మార్చి 16 ప్రభాతవార్త


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మండలంలో పదవతరగతి పరీక్షలు సజావుగా జరిగినట్లు ఎంఈఓ ప్రసాద్ రెడ్డి తెలిపారు.470 విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరు అయినట్లు తెలిపారు. ఈక్రమంలో తహశీల్దారు శ్రీధర్,ఎస్ఐ రాజ్ కుళ్ళాయప్ప పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.అలాగే ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి నాగరాజు నాయక్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసారు.

09ATP27_09ATP27.qxd 16-03-2026 PM 10:22 Page 1



## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

**గుంతకల్లు, మార్చి 16 ప్రభాతవార్త**

ఆంధ్ర రాష్ట్ర సాధకుడు అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ భవనంలో కమిషనర్ ఎం.లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఉక్కు సంకల్పంతో 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించాడని గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పలికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన జీవితం దారపోశాడని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి ఆర్డీవో శ్రీనివాస్, చైర్పర్సన్ భవాని, డిఎస్పి శ్రీనివాస్, ఎమ్మెల్యే సోదరుడు మండల ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, డిఎల్డిఓ విజయలక్ష్మి, తహశీల్దార్ రమాదేవి, మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్ మోహన్, కూటమి నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షలకు 17 మంది గైర్హాజరు

**గుంతకల్లు, మార్చి 16 ప్రభాతవార్త**

10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారులు మస్తాన్‌రావు, సుబ్బరాయుడులు సోమవారం తెలిపారు. పట్టణంలో 9 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 2388 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా మొదటి రోజు 17 మంది హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతుల పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.

## మండల కన్వీనర్ ఆధ్వర్యంలో... మల్లాపల్లిలో అన్నదాత సుఖీభవ



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

**గోరంట్ల, మార్చి 16 ప్రభాతవార్త**

గోరంట్ల మండలం మల్లాపల్లి పంచాయతీ కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా పిఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని టిడిపి మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రైతులు అందరూ ఉగాది సందర్భంగా కూటమి ప్రభుత్వం పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కింద 6 వేలు రూపాయలు మంజూరు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారని మండల కన్వీనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పది పరీక్షల తీరును పర్యవేక్షించిన అధికారులు

**గోరంట్ల, మార్చి 16 ప్రభాతవార్త**



పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తున్న దృశ్యం

గోరంట్ల మండల కేంద్రంలో సోమవారం ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ తీరును విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు. స్థానిక పోలీసుల పర్యవేక్షణలో మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి గోపాల్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 885 మంది విద్యార్థులు నాలుగు సెంటర్లలో పరీక్షలు రాయవలసి ఉండగా అందులో సోమవారం జరిగిన మొదటిరోజు పరీక్షలకు ఎనిమిది మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ తీరును ఫ్లయింగ్‌స్క్వాడ్ జిలాన్‌బాష, మండల విద్యాశాఖ అధికారి గోపాల్, సిఐ శేఖర్‌లు పర్యవేక్షించారు.

## పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన తహశీల్దారు, ఎంపిడిఓ

**అగళి, మార్చి 16 ప్రభాతవార్త**



తనిఖీ చేస్తున్న దృశ్యం

సోమవారం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అగళి మండలంలో మధూడి ఉన్నత పాఠశాలతోపాటు అగళి కెజిబివి పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు తహశీల్దారు సుబ్బారావు, ఎంపిడిఓ గంగాధర్, ఎంఈఓ కృష్ణమూర్తిరాజు, డిప్యూటీ ఎంపిడిఓ రెడ్డి ప్రకాష్, ఏఎస్ఐ బషీర్, రాజు, కార్యదర్శి గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఎండలో బయట తిరిగే సమయంలో జాగ్రత్తలు పాటించండి

**-వడదెబ్బపై అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్**

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త**



రాకెట్లలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోందని బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్ సూచించారు. మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో సోమవారం ప్రజలకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, సీహెచ్‌వో నాగరంగయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయట ఎండలో తిరగరాదని, ఎక్కడికైనా వెళ్లే సమయంలో వెంట నీరు తీసుకెళ్లాలని, నల్లటి దస్తులు ధరించరాదని, కాలికి చెప్పులు, తలకు టోపీ లేక తలపాగా ధరించాలని సూచించారు. ఎక్కువ సమయంలో ఎండలో పనిచేసిన సమయంలో ఎవరికైనా తలనొప్పి, తల తిరగడం, నీరసం, జ్వరం, నాలుక ఎండిపోవడం, స్పృహ కోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చెట్టునీడకు తరలించి ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించాలని సూచించారు. వేసవి కాలంలో గృహంలో లభించే ద్రవపదార్థాలు బాగా తీసుకోవాలని, పుచ్చకాయ, కొబ్బరి బోండం లాంటి అధిక నీరుగల వాటిని తీసుకోవాలని సూచించారు. అవగాహన అనంతరం వడదెబ్బకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సజావుగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

**గుత్తి, మార్చి 16 ప్రభాతవార్త**



పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల కోలాహలం

గుత్తి పట్టణంతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం పదవ తరగతి వార్షిక పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రవినాయక్ తెలిపారు. గుత్తి పట్టణంలో మహర్షి దయానంద గురుకులం, వివేకానంద హైస్కూల్, గుత్తి ఆర్ఎస్‌లోని సెయింట్ మేరీ హైస్కూల్, గుత్తి కోటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, అదేవిధంగా రజాపురంలోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా 1518 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 26 మంది గైర్హాజరయ్యారని ఆయన వివరించారు. పరీక్షలకు 1492 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అర్బన్ సిఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు.

## ఈద్గా మైదానం శుభ్రతకు చర్యలు

**గుత్తి, మార్చి 16 ప్రభాతవార్త**



ఈద్గా మైదానాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం పురస్కరించుకుని సామూహిక ప్రార్థనల కోసం ఈద్గా మైదానాన్ని సోమవారం శుభ్రం చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్పర్సన్ వన్నూరుబి, కమిషనర్ జబ్బార్‌మియా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జెసిబిల సహాయంతో మైదానాన్ని శుభ్ర పరిచారు. ఈ కార్యక్రమాన్ని మాజీ సర్పంచు హుస్సేన్‌పీరా పర్యవేక్షించారు.

## వ్య.కా.స. నూతన కార్యవర్గం ఏర్పాటు

**గుత్తి, మార్చి 16 ప్రభాతవార్త**



అధ్యక్షుడు చందు , కార్యదర్శి మల్లేష్

సిపిఎం పార్టీ అనుబంధ వైన వ్యవసాయ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా చందు, కార్యదర్శిగా మల్లేష్ ఎంపికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా మద్దిలేటి, రామేశ్వరి, వన్నూరమ్మ, సహాయ కార్యదర్శులుగా నారాయణస్వామి, నిర్మల, జయమ్మ, కోశాధికారిగా ఊర్మిళ, సభ్యులుగా రవి, రాము, నాగరత్న, సునీత, పార్వతి, రేణుక, శశికళను ఎంపిక చేశారు. వ్యవసాయ కార్మిక సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

## మంగే రమేష్‌కు జాతీయ పురస్కారం

**గుత్తి, మార్చి 16 ప్రభాతవార్త**



అవార్డు అందుకుంటున్న దృశ్యం

రాష్ట్ర చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి మంగే రమేష్‌కు జాతీయ స్థాయి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పురస్కారాన్ని ప్రకటించారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ ఆయనకు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రాజారావు, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

**-పొట్టి శ్రీరాములు జయంతి నాడు అవోపా సేవా కార్యక్రమాలు**

**-పొట్టి శ్రీరాములుకు...భారతరత్న ప్రకటించాలి**

**గోరంట్ల, మార్చి 16 ప్రభాతవార్త**



నివాళులు అర్పిస్తున్న నాయకులు

గోరంట్ల పట్టణ అవోపా కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125 వ జయంతి సందర్భంగా ఆయనకు పూలమాల వేసి ఆంధ్రరాష్ట్రం అవతరించడానికి ఆయన 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేయడాన్ని గుర్తు చేసుకుంటూ గోరంట్ల పట్టణ సమీపంలో ఉన్న మంజులమ్మ వృద్ధాశ్రమంలో సోమవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



అన్నదానం చేపడుతున్న నేతలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాపన కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య పొలిటికల్ నాయకులు సుకుమార్‌గుప్తా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అవోపా గౌరవ అధ్యక్షులు సుకుమార్‌గుప్తా, అధ్యక్షులు శబరీష్, సెక్రటరీ రవితేజ, ట్రెజరర్ ఉపాధ్యాయులు రమేష్, సలహాదారులు రాజేష్, కమిటీ సభ్యులు సుంకు కిష్టయ్య, వెంకటేష్, మురళి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు ఏడు మంది విద్యార్థులు గైర్హాజరు

**కనగానపల్లి మార్చి 16 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ విద్యాలయం, ఆదర్శ పాఠశాల నందు సోమవారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు మొత్తం 351 మంది విద్యార్థులు ఉండగా ఏడు మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు.

## సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు డిగ్రీ విద్యార్థి కె.వంశీకుమార్

**-అభినందించిన ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ, సిబ్బంది**

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త**



సౌత్‌జోన్ విద్యార్థి కె.వంశీకుమార్

ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం డిజిటల్ మార్కెటింగ్ కోర్సు చదువుతున్న కె.వంశీకుమార్ అనే విద్యార్థి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ, వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్.మస్తానప్ప, స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎస్.నారాయణస్వామి, ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రశాంత్‌కుమార్ సోమవారం తెలిపారు. తమిళనాడులోని వేల్లూర్ విట్ విశ్వవిద్యాలయంలో ఈనెల 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో కె.వంశీకుమార్ అనంతపురం ఎస్.కె.యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడన్నారు. కె.వంశీకుమార్ సౌత్‌జోన్ పోటీలకు ఎంపికై కళాశాల కీర్తిప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశాడన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు వారి సొంతమవుతుందన్నారు. కె.వంశీకుమార్ సౌత్ జోన్ పోటీల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ అభినందించారు.

## ఉరవకొండలో ఘనంగా పొట్టి శ్రీరాములు 125వ జయంతి

**-విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు**

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త**



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉరవకొండ పట్టణంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక పాత బళ్లారి రోడ్ల కూడలిలోగల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు స్థానికులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పి.నిరంజన్‌గౌడ్, టీడీపీ సీనియర్ నాయకులు చాబాల ఈశ్వరయ్య, ఈడిగ వేణుగౌడ్, సామాజిక కార్యకర్త పి.లెనిన్‌బాబు తదితరులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేశారని చరిత్ర పుటల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ప్రతి తెలుగువాడి గుండెల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సీనియర్ ఎలక్ట్రీషియన్ గోపాల్ పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను అందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకర సుదర్శన్, ఆటో శీనా, కురుబ రమేష్, కాంగ్రెస్ నాయకులు రాము, స్థానికులు అనీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్నాటక అక్రమ మద్యం రవాణాపై పటిష్ట నిఘా ఉంచండి

**-ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ నాగమద్దయ్య**

**-ఉరవకొండ ఎక్సైజ్ స్టేషన్, సరిహద్దు చెక్‌పోస్టులు తనిఖీ**

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త**



ఉరవకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమీషనర్ నాగమద్దయ్య

సరిహద్దు ప్రాంతంలో కర్నాటక నుంచి వచ్చే అక్రమ మద్యంపై పటిష్ట నిఘా కొనసాగించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. సోమవారం ఆయ పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌తోపాటు, విడపనకల్లు మండలంలోని రాష్ట్ర సరిహద్దులోగల విడపనకల్లు, డోనేకల్లు ఎక్సైజ్ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.



డోనేకల్లు సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీసీ నాగమద్దయ్య

ఈ సందర్భంగా డిప్యూటీ కమీషనర్ నాగమద్దయ్య మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రం నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అంతకు ముందు ఎక్సైజ్ సర్కిల్‌లో మద్యం రాబడి, కేసులపై స్టేషన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర, చెక్‌పోస్టు అధికారి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

**-ఉరవకొండ నియోజకవర్గ ప్రత్యేక అధికారి టి.పద్మావతి**

**-ఉరవకొండలో ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు**

**ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త**



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం సాధించడం కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి చివరికి తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.పద్మావతి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక పాత బళ్లారి రోడ్ల కూడలిలోగల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి సర్పంచ్ మీనుగ లలిత, మార్కెట్ యార్డు చైర్మెన్ నరసేటి విజయభాస్కర్, ఎంపీపీ ఎం.నరసింహులు, పీఏసీఎస్ చైర్మెన్ ప్యారం కేశవానంద, ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్, డిప్యూటీ ఎంపీడీవోలు పి.సతీష్‌బాబు, షేక్ మహమ్మద్ రఫీ తదితరులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయం చేరుకొని అమరజీవి చిత్రపటానికి పూలమాలవేసి అమరావతిలోని స్మృతివనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి సందేశాన్ని విన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి టి.పద్మావతి మాట్లాడుతూ అమరావతిలోని శాఖమూరు పార్కువద్ద 150 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును తలపెట్టగా 6.8 ఎకరాల స్థలో మోదటి దశ పనులు పూర్తి అయ్యాయని పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు కేవలం 6 నెలల్లోనే రికార్డు స్థాయిలో పనులు చేపట్టి 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాసాపురం సర్పంచ్ కె.సీతారాములు, వార్డు సభ్యుడు పి.నిరంజన్‌గౌడ్, ఎంపీటీసీ జి.వన్నూరుసాబ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ ఎం.జయప్రకాష్‌గౌడ్, మండల పరిషత్ ఏవో శంకర్, ఆపద్బాంధవ ట్రస్టు చైర్మెన్ వేల్పుల మురళి, కరెంటు గోపాల్, టీడీపీ నాయకులు పి.రాజేష్, ఎం.వర ప్రసాద్, బి.సు ంకన్న, పాల గోవిందు, ఈడిగ విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణంకు విరాళం..వాల్మీకి సంఘం అధ్యక్షులు

**డి.హిరేహాళ్ మార్చి16 ప్రభాతవార్త**



విరాళం ఇస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి క్రిష్టప్ప

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో నూతన దేవాలయ నిర్మాణంకు విరాళం వితరణ చేశారు. సోమవారం రాయదుర్గం పట్టణంలోని తన స్వగృహంలో ఆ సేవా సమితి ఉపాధ్యక్షులు మలకన్న సభ్యులతో కలిసి ఆయన విరాళం అందజేశారు. రాయదుర్గం మండలం రాతిబావివంక గ్రామానికి చెందిన సేవాభాయి ఉద్ధవ్ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ సభ్యులు గ్రామంలో సేవాలాల్ మహారాజ్ నూతన దేవాలయ నిర్మాణం విషయం ఆయన దృష్టికి తీసుకెళ్ళి విరాళం కోరారు. అందుకు సమ్మతించిన ఆయన వాల్మీకి సంక్షేమ సేవా సమితి తరపున కమిటీ సభ్యులకు రూ.10100లు విరాళం అందజేశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ మీ కులదైవం అవధూత సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణం చేపట్టడం ఎంతో పుణ్యకార్యమని ఈ మహత్తర కార్యంకు విరాళం అందజేయడం తనకి ఎంతో ఆనందంగా ఉందని కమిటీ సభ్యులకు ఆయన తెలిపారు. విరాళం అందుకున్న సేవాభాయి ఉద్ధవ్ ట్రస్ట్ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ హేమలనాయక్, విశ్రాంతి ఉద్యోగి బాలాజీనాయక్ ఇతర కమిటీ సభ్యులు మాట్లాడుతూ విరాళం అడిగిన వెంటనే కుల, మత, రాజకీయాల కతీతంగా తన వంతు సహాయంగా విరాళం అందించి మానవతా దృక్పథం ను చాటుకున్నారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సేవా సమితి సభ్యులు విశ్రాంతి ఆర్మీ ఉద్యోగి వాల్మీకి జోగప్ప, అజయ్ టైలర్ రఘు, పై తోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శం

**రొళ్ల మార్చి16(ప్రభాతవార్త)**



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన రెవిన్యూ సిబ్బంది

తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను రొళ్ల తాహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి రెవిన్యూ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తాహసిల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. తెలుగువారి క్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అర్పించిన త్యాగమూర్తి అని కొనియాడారు. ఆయన ఆశయాల అడుగు జాడలో నడవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరీయప్ప, జూనియర్ అసిస్టెంట్ రఫిక్, వీఆర్వోలు లక్ష్మీ నరసప్ప, చిరంజీవి, నాగరాజ్, ధనలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ నరసే గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పి జి ఆర్ ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం అందించండి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**పుట్టపర్తి, మార్చి 16, ప్రభాతవార్త**

పిజిఆర్ఎస్ కార్యక్ర మం ద్వారా ప్రజలు అందించే వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలని సంబంధిత పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాల యంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 81 అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖిమాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్పీతోపాటు, అడిషనల్ ఎస్పీ అంకిత సురాన,సిఐబొజ్జప్ప, లీగల్‌అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## అబ్బురపరచిన కళ్యాణ శ్రీనివాసం కూచిపూడి నృత్యం

**ధర్మవరంటౌన్ , మార్చి 16 ప్రభాతవార్త**



కళ్యాణ శ్రీనివాసం నృత్యప్రదర్శన చేస్తున్న ధర్మవరంకళాకారులు

తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో టీటీడీ వారిచే నిర్వహించిన అన్నమయ్య 523వ వర్ధంతి మహోత్సవాలలో భాగంగా ఆదివారం ధర్మవరం లలిత నాట్యకళానికేతన్ గురువులు, శిష్యబృందం కూచిపూడి నృత్యం పలువురిని ఆకట్టుకుంది. కళానికేతన్ గురువులు బాబుబాలాజీ, రామలాలిత్య, శిష్యబృందం కళ్యాణ శ్రీనివాసం కూచిపూడి నృత్య రూపకాన్ని కన్నులపండువగా ప్రదర్శించారు. ఈ నృత్య నాటికలో వేంకటేశ్వరస్వామి గారామలాలిత్య, అన్నమయ్యగా బాబూబాలాజీ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. దీంతో అన్నమయ్య కళామందిర్ నిర్వాహకులు గురువులును. శిష్యబృందాన్ని సత్కరించారు.

